## పథకాలను కొనసాగించండి

◆ పాలమూరు కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్, డిసెంబర్ 5 : ప్రజలకు మేలు చేసే ప్రభుత్వ ప్రాధాన్య పథకాలను కొనసాగించాలని కలెక్టర్ రవినాయక్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కలెక్టర్ జిల్లా అధికారుల సమీకృత కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు, విద్య, వైద్యం, హరితహారం, పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ పరిష్కారం తదితర ప్రజలకు సేవలందించే కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మిన ధాన్యం, అలాగే ఆయా ధాన్యం కొనుగోళు కేంద్రాల్లో ప్రస్తుతం అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యం తదితర వివరాలను సమర్పించాలని వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రంలోగా 80శాతం ట్రక్ షీట్ జనరేషన్ చేసి పంపించాలని చెప్పారు. ఈ-ఆఫీస్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయాలని చెప్పారు. జిల్లాలో రాష్ట్ర శాసన సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకుగానూ జిల్లా అధికారులను, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఆర్డీవో యాదయ్య, డీఆర్వో రవికుమార్, అధికారులు ఉన్నారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం చేయాలి

మహబూబ్‌నగర్, డిసెంబర్ 5 : దేశవ్యాప్తం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నేషనల్ అలియన్స్ ఎన్‌ఏపీయూడబ్ల్యూ జాతీయ నాయకుడు వెంకటయ్య డిమాండ్ చేశాడు. మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా కల్పించాల్సిన సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ కార్యదర్శి గట్టు నర్సింహులు, బృందం బీడీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర కార్యదర్శి కల్పన, పాల్గొన్నారు.

## పదో తరగతి ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

పాలమూరు, డిసెంబర్ 5 : మార్చి-2024 సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్షల రుసుము చెల్లింపు తేదీలను పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు గమనించి పరీక్ష ఫీజు ఈనెల 7వ తేదీ వరకు అపరాధ రుసుము లేకుండా చెల్లివచ్చని, అదేవిధంగా 14వ తేదీ వరకు రూ.50అదనపు రుసుముతో, 21వతేదీ వరకు రూ. 200అదనపు రుసుముతో, జనవరి 3వ తేదీ వరకు రూ.500 అదనపు రుసుముతో తెలిపిన తేదీల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల నుంచి పరీక్షా రుసుము తీసుకొని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని డీఈవో పేర్కొన్నారు.

## కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 5 : హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఇంటర్ కళాశాలల కరాటే టోర్నీలో జిల్లా కేంద్రంలోని కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు అర్షజమీల్ బంగారు, ఉజేఫ్‌షరీఫ్ కాంస్య పతకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ జహంగీర్ పాషాఖాద్రీ తెలిపారు. అర్షజమీల్ మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న సౌత్‌వెస్ట్‌జోన్ యూనివర్సిటీ కరాటే టోర్నీకి ఎంపికైనట్లు తెలిపారు. పతకాలు సాధించడం పట్ల జహంగీర్‌పాషా ఖాద్రీ ప్రత్యేకంగా అభినందించారు.

## 7న ఉద్యోగ మేళా

పాలమూరు, డిసెంబర్ 5 : జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రోడ్ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 7వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మహమ్మద్ జానీపాషా మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో భారత్‌పే, క్యూఆర్ కోడ్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేయుటకు 200 ఉద్యోగాల ఖాళీల భర్తీకోసం అర్హతగల ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఆ పై చదివిన నిరుద్యోగ అభ్యర్థులు ఈనెల 7వ తేదీ ఉదయం 10:30గంటలకు తమ సర్టిఫికెట్స్, బయోడేటా ఫారంతో కార్యాలయంలో హాజరుకావాలని కోరారు. వివరాలకు 994 8568830, 9912605508లను సంప్రదించాలన్నారు.

## వేములలో ఆటో దగ్ధం

మూసాపేట, డిసెంబర్ 5 : ఆకస్మికంగా గ్యాస్ లీక్ కావడంతో ఆటో దగ్ధమైన ఘటన మూసాపేట మండలం వేములలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు వేముల గ్రామానికి చెందిన ఆంజనేయులు తన ఆటోలో మూసాపేటకు వస్తున్నాడు. మార్గమధ్యలో కోజెంట్ పరిశ్రమ సమీపంలో నడుస్తున్న ఆటోలో నుంచి పొగలు వస్తుండడంతో ఆంజనేయులు ఆటోను ఆపి చూసేలోపే మంటలు ఎక్కువ అయినట్లు, నిమిషాల వ్యవధిలోనే ఆటో పూర్తిగా మంటల్లో కలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

# దడ పుట్టిస్తున్న మిగ్‌జాం తుఫాన్

◆ రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న వ్యవసాయ అధికారులు



జడ్చర్ల : నూర్పిళ్లు చేస్తున్న వరికోత మిషన్

జడ్చర్ల, డిసెంబర్ 5 : వరిచేన్లు కోతలకు రావడంతో రైతులు వరిపైర్ల నూర్పిళ్లు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని ఆయా గ్రామాల్లో పంటల నూర్పిళ్లు చేస్తున్నారు. అదేవిధంగా పత్తిపంట కూడా చేతికొచ్చింది. పత్తిని కూడా తీస్తున్నారు. కొన్ని చోట్ల కూలీలు రాక పత్తిచెట్లకే ఉండిపోయింది. ఈ సమయంలో మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతుల గుండెల్లో దడపుట్టిస్తుంది. ఇన్నాళ్లు కష్టపడి పండించిన పంటలు వర్షార్పణం అవుతాయనే ఆందోళన రైతుల్లో నెలకొన్నది. వరిచేలు కోతలు చేస్తున్నారు. ఈ సమయంలో తుఫాను రావడంతో రైతులు వరికోత మిషన్లకోసం పరుగులు పెడుతున్నారు. అవి కూడా సరిపడ లేకపోవడంతో అవి దొరకడంలేదు. కూలీలురాక, మిషన్లు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి అప్పుడప్పుడు తుంపర పడుతుండడంతో రైతులు మరింత బయపడుతున్నారు. వరికోతలు చేసిన రైతులు ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కుప్పలు పోశారు. వర్షం వస్తుండడంతో వాటిపై కవర్లను కప్పి రక్షించుకుంటున్నారు. అదేవిధంగా వర్షం కురిస్తే వరిపైర్లు నేలకొరిగి మొలకెత్తే అవకాశం ఉంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. తుఫాను ప్రభావం ఉండడంచేత రైతులు వరికోతలు చేయరాదని, నూర్పిళ్లు చేసిన రైతులు ధాన్యం కుప్పలపై కవర్లు కప్పి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి గోపీనాథ్ రైతులకు తెలిపారు. ఒక వేళ వర్షం కురిస్తే వరిచేనులో నీరు నిల్వకుండా గట్లను తెంచి ఉంచాలని దీంతో నీళ్లు బయటకు వెళ్లి గింజలు మొలకెత్తే అవకాశం ఉండదని అందుచేత రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి

మిడ్జిల్, డిసెంబర్ 5 : తుఫాన్ ప్రభావంతో అకాల వర్షాలకు ధాన్యం తడవ కుండా రైతులకు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఏవో సిద్ధార్థ అన్నారు. రెండు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చెటుచేసుకున్నది. గ్రామాల్లో రైతులు ధాన్యంను రోడ్డు వెంబడి ఆరబోశారు. ధాన్యం తడవకుండా కవర్లును ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోల్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నెలకొన్న సందర్భంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



మిడ్జిల్ : వాడ్యాల్‌లో ధాన్యం తడవకుండా కవర్లు కప్పిన దృశ్యం

### రైతులు అప్రమత్తంగా ఉండాలి

రాజాపూర్, డిసెంబర్ 5 : తుఫాను ప్రభావంతో మండలంలో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి నరేందర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన మిగ్‌జాం తుఫాను ప్రభావంతో మండలంలో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరిధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ధాన్యం కుప్పలు తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలని తెలిపారు. తుఫాన్ కారణంగా రైతులు అవసరమైతేనే బయటికి రావాలని సూచించారు.

# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బాలికల జట్టు ఎంపికలు


జడ్చర్లటౌన్, డిసెంబర్ 5 : ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జడ్చర్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గానూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్టు ఎంపికయ్యింది. బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అండర్ 17 విభాగంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్టు ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు చెందిన 80మంది క్రీడాకారిణీలు హాజరయ్యారు. అంతర్ జిల్లాలకు చెందిన జట్ల మధ్య ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు గానూ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టుకు జి. శ్రావణి, అయేషా, ఎం. ధరణి, పి. శిరీష, సునీత, అక్షిత, మనీరా, ప్రణవి, మీనాక్షి, అఖిల, సంగీత, తైసిన్, ఎన్. శ్రావణి, కె. ఇందు, మల్లిక, పి. శ్రావ్య, జెసిక, సంధ్య, వినిత, రషీక, వర్షిణి, పి. అక్షర, ఎస్. దివ్య, హర్షిణి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి జడ్చర్లలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు తరపున ఎంపికైన క్రీడాకారులు ఆడనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మొత్తం 10 ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్‌బాబు, టీపీఈటీ సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణ, పీ.డీ. వడెన్న, భానుకిరణ్, సురేందర్‌రెడ్డి, మోయిన్, తిరుపతి, రాజేందర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

# తూకం లేకుండానే ధాన్యం కొనుగోలు

◆ రెండు రోజులుగా నడుస్తున్న వ్యవహారంచోద్యం చూస్తున్న అధికారులు

◆ ధాన్యం విక్రయంలో నష్టపోతామంటున్న రైతులు

మహ్బూబాద్, డిసెంబర్ 5 : మండలంలోని చౌదర్‌పల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యంతో వరి ధాన్యాన్ని ఎలాంటి తూకం చేయకుండానే కొనుగోలు చేస్తున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఇటీవల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారుల ప్రారంభించారు. రెండు రోజులుగా తూకం మిషన్ చెడిపోయిందని రైతుల నుంచి తూకం చేయకుండానే వరి ధాన్యం బస్తాలు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు రోజులుగా దాదాపు 700 వంద ల నుంచి 800 బస్తాలు తూకం చేయకుండా కొనుగోలు చేసినట్టు పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు అన్యా యం జరుగుతున్న సంబంధిత ఏపీఎం, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎం సునీతను వివరణ కోరగా ఇప్పటి వరకు చౌదర్‌పల్లి కొనుగోలు కేంద్రంలో ఎలాంటి కొనుగోలు చేయలేదు. బుధవారం అక్కడికి వెళ్లి రైతులతో మాట్లాడి తూకం లేకుండా ధాన్యం కొనుగోలు చేసినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చౌదర్‌పల్లిలో ధాన్యం బస్తాలను లారీలోకి ఎక్కిస్తున్న నిర్వాహకులు

# కనీస సామర్థ్యాలు పెంచాలి

రాజాపూర్ డిసెంబర్ 5 : విద్యార్థులకు ప్రతి సబ్జెక్టుపై కనీస సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈవో బాలు యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక పాఠశాల స్థాయి కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని, సమయపాలన పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతుబంధు

## జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా

మహబూబ్‌నగర్, డిసెంబర్ 5 : మహబూబ్‌నగర్ జిల్లా రైతుబంధు అధ్యక్ష పదవికి గోపాల్‌యాదవ్ మంగళవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్ రవినాయక్‌ను కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. తమకు అవకాశం కల్పించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు, రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కరాటే విద్యార్థులకు న్యాయం చేయాలి

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 5 : ఇటీవల జడ్చర్లలో జరిగిన ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపికల్లో పలువురు విద్యార్థులకు న్యాయం జరగలేదని కోరుతూ మంగళవారం డీఈవో రవీందర్‌కు కరాటే మాస్టర్లు సయ్యద్‌అశ్ఫక్, లక్ష్మణ్ వినతిపత్రం అందజేశారు. జడ్చర్లలో జరిగిన ఎంపికల్లో విద్యార్థులకు సమాచారం ఇవ్వామని తెలిపారు. తమకు సమాచారం లేకుండానే ఎంపికలు పూర్తి చేసి రాష్ట్రస్థాయికి తీసుకెళ్లారని వినతిలో పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలని వినతిలో కోరినట్టు తెలిపారు.

## యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

జడ్చర్లటౌన్, డిసెంబర్ 5 : కుటుంబ సమస్యలతో మనోవేదనకు గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడుతున్న ఓ యువకుడిని జడ్చర్ల పోలీసులు సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడిన ఘటన మంగళవారం జడ్చర్లలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన ఓ యువకుడు కుటుంబ సమస్యలతో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాల మీదకెళ్లాడు. ఈ క్రమంలో పట్టాల సమీపంలో ఉన్న వంశీ అనే యువకుడు గుర్తించి వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. సమాచారం తెలుసుకున్న జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ వెంటనే పోలీసు సిబ్బందిని పంపించగా సిగ్నల్‌గడ్డ వద్ద రైలు పట్టాలపై వెళ్తున్న సదరు యువకుడిని పోలీసులు గుర్తించి ప్రాణాలు కాపాడారు. అనంతరం సదరు యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. 100 డయల్ సమాచారంతో వెంటనే స్పందించి యువకుడిని ప్రాణాలు కాపాడిన జడ్చర్ల పోలీసులకు పట్టణ వాసులు అభినందించారు.

## హ్యాండ్‌బాల్, వాలీబాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 5 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లా బాలుర హ్యాండ్‌బాల్, 7న ఉమ్మడి జిల్లా వాలీబాల్ బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేష్‌బాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో ఎంపికలు ఉంటాయని, విద్యార్థులు పాఠశాల బోనఫైడ్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు.